జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
ఖమ్మం
మంగళవారం | 28 | జులై | 2026 ◆ పేజీలు : 7



# రైతు నేస్తం కార్యక్రమంలో పాల్గొనండి

◆ వేంసూరు కే జి మల్లెల రైతు వేదికల్లో మంత్రి తుమ్మల వీడియో కాన్ఫరెన్స్



**వేంసూర్ జులై 27 ప్రజాజ్యోతి** వేంసూరు మండలం లో పి ఏ సి ఎస్ ఛైర్మెన్ ,మరియు ప్రజాప్రతినిధులకు నేడు మంగళవారం నాడు ఉదయం 9.30 గంటలకు, గౌరవ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గారు రైతునేస్తం ప్రోగ్రామ్ ద్వారా మన వేంసూర్ మరియు కేజీ మల్లెల రైతు వేదికలలోని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా, రైతు సోదరులకు ఎల్ నినో ప్రభావం – మరియు వాతావరణ అనుకూల పంటల సాగు గురించి ముచ్చటిస్తారు. రెండు రైతు వేదికల పరిధిలోని సర్పంచ్ ప్రజా ప్రతినిధులు మరియు రైతు సోదరులు పాల్గొని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరావు మరియు శాస్త్రవేత్తల అమూల్య సూచనలు పొందవలసినదిగా మండల వ్యవసాయ అధికారి వేంసూర్ వారు కొరట మైనది

- ఉచితాలు కావు... ప్రజా పెట్టుబడులు
- అర్థాకలితో ఏ బిడ్డ బడికి వెళ్లొద్దు
- సానబెట్టిన వజ్రాల్లా మానవ వనరులు
- పాలన అంటే పెత్తనం కాదు... సమాజ హితం
- 'పీపుల్స్ మార్చ్' నుంచే ప్రజాహిత ఇందిరమ్మ పథకాలు
- మధిర లో సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ ను ప్రారంభించిన డిప్యూటీ సీఎం



# విద్యార్థుల భవిష్యత్తే... రాష్ట్ర భవిష్యత్తు...



## రాష్ట్ర డిప్యూటీ సీఎం, ఆర్థిక, ఇంధన, ప్రణాళిక శాఖల మంత్రివర్యులు భట్టి విక్రమార్క మల్లు

**మధిర, ప్రజాజ్యోతి** ఉచిత పథకాలు అనేవి ఈ రాష్ట్ర ప్రజలపై ప్రభుత్వం పెట్టే పెట్టుబడి అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు స్పష్టంగా ప్రకటించారు. మిడిమిడి జ్ఞానంతో తెలిసి తెలియక చాలామంది ఉచిత పథకాల పైన విమర్శ చేస్తున్నారని ఆయన తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. పరిశ్రమలు ప్రాజెక్టులు ఇతర అనేక అంశాలపై ప్రభుత్వం పెట్టుబడి పెట్టినట్లుగానే పేదలు, దళితులు, వెనుకబడిన వర్గాలు సహా రాష్ట్రవ్యాప్తంగా ప్రజలందరి పైన ప్రభుత్వం పెట్టుబడి పెడుతుందని ఆయన అన్నారు. ఈ పెట్టుబడి ఫలితాలు ప్రజలు అభివృద్ధి చెంది ఆర్థికంగా, సామాజికంగా ముందుకు వెళ్లేందుకు దోహదం చేసేవిగా ఉంటాయని

మిగతా 7 లో...

# రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలి



జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

ప్రతి రోగికి మెరుగైన వైద్య సేవలు అందేలా అధికారులు కృషి చేయాలి

- అధికారులు సమయ పాలన పాటించాలి
- మందుల కొరత లేకుండా జాగ్రత్తలు పడాలి
- ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి
- రోగులకు సౌకర్య మైన వాతావరణాన్ని కల్పించాలి
- బోనకల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

**బోనకల్, జూలై 27(ప్రజా జ్యోతి):** ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలకు వచ్చే ప్రతి రోగికి నాణ్యమైన, సకాలంలో వైద్య సేవలు అందేలా అధికారులు, వైద్యులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు. సోమవారం బోనకల్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని

మిగతా 2 లో...

# వరుస చోరీలు కలకలం..

పిండిప్రోలు, బీరోలు తర్వాత కాకరవాయిలో మరో భారీ చోరీ.

- సంఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు.. కేసు నమోదు.
- రూ.1 లక్ష నగదు, 5 తులాల బంగారం అపహరణ.. పోలీసు గస్తీ పెంచాలని గ్రామస్తుల డిమాండ్.
- సంఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు.. కేసు నమోదు.
- ఆధారాలు సేకరించి దర్యాప్తు చేపట్టిన పోలీసులు.



**తిరుమలాయపాలెం, జూలై 27 (ప్రజాజ్యోతి):** తిరుమలాయపాలెం మండలంలో వరుసగా చోటుచేసుకుంటున్న చోరీలు ప్రజలను తీవ్ర భయాందోళనకు గురిచేస్తున్నాయి. ఇటీవల పిండిప్రోలు, బీరోలు గ్రామాల్లో దొంగతనాలు జరగగా, తాజాగా

మిగతా 2 లో...

- పేరుకు మాత్రమే బోనకల్ మండల కేంద్రంలో గ్రంథాలయం
- చదివేందుకు పుస్తకాలు కరువు
- సౌకర్యాలు లేక పాఠకుల ఇబ్బందులు
- ఈ గ్రంథాలయానికి రావలసిన ఉద్యోగి ఎక్కడ.?
- గ్రంథాలయం గురించి మరచిన పాలకులు
- ఎవరూ లేని ఈ గ్రంథాలయంలో యువకులు అష్టాచమ్మా ఆటలు
- రికార్డుల ప్రకారం బోనకల్ గ్రంథాలయములో ఉద్యోగం
- పెత్తనం మాత్రం జిల్లా గ్రంథాలయంలోనే అంట




# ఈ గ్రంథాలయంలో ఎవరు ఉండరు

**బోనకల్, జూలై 26 (ప్రజాజ్యోతి):** ప్రజల విజ్ఞానం కోసం, వివిధ రకాల పుస్తకాలు చదివి, విద్యార్థులు చదువుకోవడానికి, పరిశోధనలు చేయడానికి, జ్ఞానాన్ని పెంచుకోవడానికి ఎంతో ఉపయోగపడేవి గ్రంథాలయాలు.. గ్రంథాలయాల్లో పుస్తకాలు చదవడం ద్వారా విద్యార్థులు మరి కొత్త విషయాలు నేర్చుకోవచ్చు అనే ఉద్దేశంతో నిశ్శబ్ద వాతావరణంలో ఏకాగ్రతతో చదువుకోవడానికి అనుకూలంగా ఉండి విద్యార్థుల పోటీ పరీక్షలకు సిద్ధమవుడానికి ఈ గ్రంథాలయాలు ఎంతో ఉపయోగపడతాయి. గ్రంథాలయాలు విజ్ఞాన బండాగారాలు అంటారు.. అక్కడికి వెళితే పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే వారికి అవసరమైన పుస్తకాలు

మిగతా 2 లో...

## వరుస చోరీలు కలకలం..





(మొదటి పేజీ తరువాయి...)

కాకరవాయి గ్రామంలో మరో భారీ చోరీ వెలుగులోకి రావడంతో గ్రామస్తుల్లో ఆందోళన మరింత పెరిగింది. కాకరవాయి గ్రామానికి చెందిన బురగోమ్ముల సతీష్ నివాసంలో గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఇటీవల కుటుంబంలో కూతురు ఫంక్షన్ నిర్వహించి వచ్చిన కట్నానికి సంబంధించిన నగదు, బంగారాన్ని లక్ష్యంగా చేసుకుని ఈ చోరీ చేసినట్లు బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు. బాధితుడి వివరాల ప్రకారం, దొంగలు సుమారు 5 తులాల బంగారు తాడుతో పాటు రూ.1 లక్ష నగదు అపహరించినట్లు సమాచారం. ఉదయం ఇంట్లో వస్తువులు చిందరవందరగా కనిపించడంతో చోరీ జరిగిన విషయం గుర్తించిన కుటుంబ సభ్యులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఆధారాలు సేకరించారు. క్లూస్ టీం సహాయంతో పరిశీలనలు నిర్వహించి కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. చోరీకి పాల్పడిన దుండగులను గుర్తించేందుకు ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ఇటీవల మండలంలోని పిండిప్రోలు, బీరోలు గ్రామాల్లో జరిగిన చోరీల తర్వాత మరో సారి కాకరవాయిలో దొంగతనం జరగడంతో ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి వేళల్లో పోలీసు గస్తీని మరింత బలోపేతం చేసి, వరుస చోరీలకు పాల్పడుతున్న దుండగులను త్వరితగతిన అరెస్టు చేయాలని గ్రామస్తులు పోలీసు అధికారులను కోరుతున్నారు.

## పాఠశాలలో అల్పాహార కార్యక్రమాన్ని ప్రారంభించిన సర్పంచ్ పరిశుద్ధరావు



**చింతకాని, జూలై 27 ప్రజాజ్యోతి** చింతకాని జులై 27ప్రజాజ్యోతి :మండలంలోని కోమట్లగూడెం ప్రభుత్వ పాఠశాలలో అల్పాహార కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ కొండూరి పరిశుద్ధరావు ప్రారంభించారు.ఈ సందర్భంగా సర్పంచ్ స్వయంగా విద్యార్థులకు అల్పాహారం వడ్డించి, వారితో ఆప్యాయంగా ముచ్చటించారు. పౌష్టికాహారం తీసుకోవడం వల్ల ఆరోగ్యం మెరుగుపడి, చదువులో మంచి ఫలితాలు సాధించవచ్చని విద్యార్థులకు వివరించారు. ప్రతిరోజూ అల్పాహారం తీసుకుని ఆరోగ్యంగా ఎదగాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు,గ్రామ ప్రజాప్రతినిధులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# ఈ గ్రంథాలయంలో ఎవరు ఉండరు

(మొదటి పేజీ తరువాయి...)

మెటీరియల్ లభిస్తుందని అందరూ భావిస్తారు. కానీ అక్కడికి వెళితే పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే వారి కోసం వారి అవసరమైన పుస్తకాలు అక్కడ కనిపించవు. అది ఎక్కడో ఉన్న గ్రంథాలయం అనుకుంటే పొరపాటే.. స్వయాన బోనకల్ మండల కేంద్రంలో ఉన్న గ్రంథాలయం పరిస్థితి ఇది. పేరుకు మాత్రమే బోనకల్ మండల కేంద్రంలో గ్రంధాలయం.. దీని గురించి పట్టించుకునే వారు లేకుండా పోయారు. ఎవరూ లేని ఈ గ్రంథాలయంలో పగలు ఖాళీగా ఉన్న బల్లపై కొంతమంది అష్టాచమ్మ ఆట ఆడుతున్నట్లు కూడా తెలుస్తుంది.? బోనకల్ గ్రంథాలయంలో ఉద్యోగం చేయాల్సిన అధికారి రికార్డుల ప్రకారం బోనకల్ గ్రంథాలయంలోనే ఉద్యోగం చేస్తున్నట్లు ఉంటాయంట.. కానీ ఆయన పెత్తనం మాత్రం జిల్లా గ్రంథాలయంలోనే చెలాయిస్తాడంట. కలెక్టర్ గ్రీవెన్స్ కు కూడా ఆయనే వెళతాడంట. బోనకల్ మండల గ్రీవెన్స్ లో ఎన్నడూ కనపడదు ఆ అధికారి.. దీనిపై జిల్లా, మండల అధికారులు ఎందుకు దృష్టిసారించడం లేదంటూ పలు ఆరోపణలు వినిపిస్తున్నాయి. గ్రంథాలయాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వివిధ పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులతోపాటు నిరుద్యోగులు ఆందోళన చెందుతున్నారు. పాలకుల్లో గ్రంథాలయాల సమస్యలు పరిష్కరించాలనే ఆలోచన కనిపించడం లేదు. దీంతో గ్రంథాలయానికి వచ్చి వివిధ పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే వారు ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు ఈ గ్రంథాలయంలో పని చేస్తున్న ఉద్యోగి చుట్టపు చూపుగా ఎప్పుడో ఒకసారి వచ్చి పోతున్నట్లు తెలుస్తుంది.? నెలకు ఒకటి, రెండు రోజులు మాత్రమే వచ్చి సంతకం పెట్టి వెళ్లిపోతున్నట్లు పాఠకు లు ఆరోపిస్తున్నా రు. ఈ గ్రంథాలయం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ గా ఉన్నప్పుడు 16 ఏప్రిల్ 2001న నాటి మధిర నియోజకవర్గ శాసనసభ్యులు కొండబాల కోటేశ్వరరావు చేతుల మీదుగా ప్రారంభించారు. ప్రత్యేక ఆహ్వానితులుగా నాటి ఖమ్మం ఎంపీ రేణుక చౌదరి హాజరయ్యారు. నాటి ప్రభుత్వం గ్రంథాలయాలను అభివృద్ధి చేసి పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే వారికి అవసరమైన పుస్తకాలతోపాటు మెటీరియల్ సిద్ధంగా ఉంచి పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే యువకులు మంచి వాతావరణంలో చదువుకోవడానికి అవకా శం కల్పించింది. ఈ ప్రభుత్వం గ్రంథాలయాను గాలికి వదిలేయడంతో నిరుద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కోచింగ్ సెంటర్లకు వెళ్లి రూ.వేలకు వేలు ఫీజులు కట్టలేని పేదవారికి గతంలో ఈ గ్రంథాలయాలు బాగా ఉపయోగపడ్డాయి. కానీ ప్రస్తుతం ఆ పరిస్థితి కనిపించక పోవడంతో పోటీ పరీక్షలకు ప్రిపేర్ అయ్యే నిరుద్యోగులు నిరాశ చెందుతున్నారు. దీంతో పాఠకులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ గ్రంథాలయంలో పని చేసే ఉద్యోగి జిల్లా గ్రంథాలయానికి పరిమితం అయినట్లు తెలుస్తుంది.? కనీసం ఈ గ్రంథాలయానికి జిల్లా అధికారులు ఎన్నడు తనిఖీలు కూడా చేయలేదు. ఎన్నడూ గ్రంథాలయానికి రాకుండా నెలనెలా జీతాలు తీసుకుంటూ గ్రంథాలయానికి వచ్చి కనిపించిన పాపాన లేదు. చేయవలసిన చోట ఉద్యోగం చేయకుండా ఆయన జిల్లా గ్రంథాలయంలో పేత్తనం చెలాయిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం..? బోనకల్ గ్రంథాలయంలో చేయవలసిన ఉద్యోగం జిల్లా గ్రంథాలయంలో చేస్తూ పెత్తనం చలాయిస్తున్నట్లు తెలుస్తుంది.? కలెక్టర్ గ్రీవెన్స్ కు కూడా ఆయనే హాజరవుతున్నట్లు తెలుస్తుంది..? ముఖ్య విషయం ఏమిటంటే జిల్లా అధికారిగా ఆదేశాలు జారీ చేస్తూ శాశ్వత ఉద్యోగులపై పేత్తనం చెలాయిస్తున్నారని ఆరోపణలు ఆయనపై జోరుగా వినిపిస్తున్నాయి..? త్వరలో అతనిపై నిరుద్యోగ యువత జిల్లా కలెక్టర్కు ఫిర్యాదు చేయబోతున్నట్లు తెలుస్తుంది. ఈ అధికారిపై జిల్లా, మండల అధికారులు చర్యలు తీసుకుంటారో లేదో వేచి చూడాలి.?

## రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలి

(మొదటి పేజీ తరువాయి...)

జిల్లా కలెక్టర్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, వైద్యులు, సిబ్బంది హాజరు, ఓపీ సేవలు, ల్యాబ్ పరీక్షలు, ఔషధాల లభ్యత, వార్డుల నిర్వహణ, రోగుల నమోదు విధానం, పారిశుద్ధ్య నిర్వహణ, పరిశుభ్రత తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. చికిత్స పొందుతున్న రోగులతో నేరుగా మాట్లాడిన కలెక్టర్ వారికి అందుతున్న వైద్య సేవలపై అభిప్రాయాలు తెలుసుకున్నారు. వైద్యులు సమయానికి అందుబాటులో ఉంటున్నారా, అవసరమైన పరీక్షలు, మందులు సకాలంలో అందుతున్నాయా, ఎలాంటి ఇబ్బందులు ఎదురవుతున్నాయా అని కలెక్టర్ ఆరా తీసారు. ఆసుపత్రిలోని ఔషధ నిల్వల గదిని పరిశీలించిన కలెక్టర్ అత్యవసర మందులతో పాటు సాధారణంగా వినియోగించే అన్ని రకాల ఔషధాలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా పటిష్టమైన నిల్వల నిర్వహణ చేపట్టాలని ఆదేశించారు. మందుల కొరత కారణంగా ఒక్క రోగి కూడా ఇబ్బంది పడకుండా ముందస్తు ప్రణాళికతో అవసరమైన స్టాక్‌ను నిర్వహించాలని సూచించారు. మందుల వినియోగం, గడువు తేదీలు, నిల్వల నమోదును ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ పారదర్శకంగా నిర్వహించాలని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ.. ప్రభుత్వ వైద్యశాలకు వచ్చే ప్రతి ఒక్కరికి నాణ్యమైన, ఉచిత వైద్య సేవలు అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటిస్తూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని, ప్రజలు ప్రభుత్వ ఆసుపత్రులపై పూర్తి విశ్వాసంతో సేవలు పొందేలా వైద్యులు, సిబ్బంది కృషి చేయాలని తెలిపారు. ఆసుపత్రి పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని, తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్య సదుపాయాలు, ఇతర మౌలిక వసతులు మెరుగ్గా ఉండేలా



చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఆసుపత్రికి వచ్చే ప్రతి ఒక్కరికీ సౌకర్యవంతమైన వాతావరణం కల్పించాల్సిన బాధ్యత అధికారులదేనని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలు ఎక్కువగా ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలపైనే ఆధారపడుతున్న నేపథ్యంలో, ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే అన్ని రకాల నాణ్యమైన వైద్య సేవలు అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని కలెక్టర్ తెలిపారు. ఆ లక్ష్య సాధనలో ప్రతి వైద్యుడు, ప్రతి ఉద్యోగి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని సీజనల్ వ్యాధులు, దోమల ద్వారా వ్యాపించే జ్వరాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజల్లో పరిశుభ్రతపై విస్తృత అవగాహన కల్పించడంతో పాటు నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. తనిఖీలో కలెక్టర్ వెంట బోనకల్ తహసీల్దార్ చల్లూరి సుధాకర్, బోనకల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారిని డాక్టర్ వేముల స్రవంతి, బోనకల్ జిపిఓ శ్రీనివాసరావు, సంబంధిత శాఖల అధికారులు, బోనకల్ వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన

- **అప్పాయిగూడెం రైతు వేదికలో విత్తన మేళా ప్రారంభం**



**కారేపల్లి,జులై27,ప్రజాజ్యోతి:** ఖమ్మం జిల్లా కలెక్టర్, జిల్లా వ్యవసాయ అధికారి దినసరి పుల్లయ్య ఆదేశాల మేరకు జూలై 27 నుంచి 29 వరకు జిల్లాలోని రైతు వేదికల్లో విత్తన మేళాలను నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి బట్టు అశోక్ కుమార్ తెలిపారు.ఈ సందర్భంగా అప్పాయిగూడెం రైతు వేదికలో సోమవారం విత్తన మేళా నిర్వహించి వివిధ పంటల విత్తనాలతో ప్రత్యేక స్టాల్‌ను ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది వర్షపాతం తక్కువగా నమోదవుతున్న నేపథ్యంలో రైతులు నీటి అవసరం తక్కువగా ఉండే ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని సూచించారు.కంది, పెసర ,మినుము,మొక్క జొన్న,బొబ్బర్లు,ఉలవలు,నువ్వులు,పొద్దుతిరుగుడు,ఆముదం, జొన్న,సజ్జ,రాగులు,వివిధ రకాల కూరగాయల విత్తనాలను సాగు చేయడం ద్వారా తక్కువ నీటితో మెరుగైన దిగుబడులు సాధించవచ్చని రైతులకు అవగాహన కల్పించారు.విత్తన మేళాలో రైతులకు వివిధ పంటల సాగు విధానాలు,విత్తనాల ఎంపిక,పంటల నిర్వహణపై వ్యవసాయ శాఖ అధికారులు సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో అప్పాయిగూడెం సర్పంచ్ దండు ప్రవీణ్, గ్రామ కార్యదర్శి కృష్ణవేణి,విత్తన డీలర్లు సురేందర్ మణియార్,రావూరి కిషన్‌రావు, గుగులోతు మోహన్, కార్తీక్, అజ్మీర నాగేష్,రైతులు తదితరులు పాల్గొన్నారు.

# వరికి బదులు ప్రత్యామ్నయం పంటల పై దృష్టి సారించండి

- జిల్లాలో అతి తక్కువ వర్షపాతం ఎర్రుపాలెం, కూసుమంచిలో నమోదైంది.
- పప్పు దినుసులు సాగుకు ఎంచుకోవాల్సిన అవసరం ఉంది.
- జిల్లా వ్యవసాయాధికారి దినసరి పుల్లయ్య



**నేలకొండపల్లి, జులై 27 ప్రజా జ్యోతి:** వరికి బదులు గా ప్రత్యామ్నం పంటల పై దృష్టి సారించాలని జిల్లా వ్యవసాయాధికారి దనసరి పుల్లయ్య సూచించారు. మండల కేంద్రంలోని రైతు వేదిక లో సోమవారం నిర్వహించిన విత్తన మేళా లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.. ప్రస్తుత పరిస్థితులలో రైతులు వరి పంటకు దూరంగా ఉండాలని సూచించారు. వర్షాభావ పరిస్థితులు ను తట్టుకునే పప్పు దినుసులను సాగు చేసుకోవాలని సూచించారు. ఆరుతడి పంటలకు రైతులు సబ్సిడీ పై విత్తనాలు ఇవ్వాలని జిల్లా. వ్యాప్తంగా రైతులు కోరుతున్నారని...ఆ విషయం ను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని పేర్కొన్నారు. రైతులను చైతన్యం చేసేందుకు ప్రతీ గ్రామంలో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. బోరుబావులను నమ్ముకుని వరి సాగు చేసి రైతులు నష్టపోకూడదన్నారు. భూగర్భజలాలు అడుగంటుతున్నాయని అన్నారు. ఎట్టి పరిస్థితులలో సాగు కు నీరు వచ్చే అవకాశం లేదన్నారు. రైతులు పరిస్థితులకు అనుగుణంగా పంటలు సాగు చేయాలని సూచించారు. ఒక పక్క నీటి కోరత, మరో పక్క విద్యుత్ సమస్య వెంటాడుతుందన్నారు. కావునా రైతులు పప్పు దినుసులు, తక్కువ నీటి శాతం అవసరం ఉన్న పంటలను సాగు చేయాలన్నారు. జిల్లాలో 12 మండలాలలో సాధారణ వర్షపాతం ఉందన్నారు. అందులో 7 మండలాలలో తక్కువ వర్షం పడగా...అతి తక్కువగా కూసుమంచి మండలంలో –60 శాతం, ఎర్రుపాలెం –71 శాతం నమోదైనట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ప్రతీ మండలం లో ఒక రైతు వేదిక లో విత్తన మేళా ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రైతులు విత్తన మేళా ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కూసుమంచి వ్యవసాయ సహాయ సంచాలకులు రాజేష్కుమార్.మార్కెట్ కమిటి చైర్మన్ వెన్నపూసల సీతారాములు, మండల వ్యవసాయాధికారి యం.రాధ, రైతు ప్రతినిధులు మేకల వెంకటేశ్వర్లు, గరిడేపల్లి రామారావు, విత్తన డీలర్లు గెల్లా వెంకటేశ్వరరావు, రామారావు, వ్యవసాయ విస్తీరణాధికారులు అరవింద్. దుర్గాభవాని తదితరులు పాల్గొన్నారు.

# ఖమ్మంలోని వెలుగుమట్ల అర్బన్ పార్క్‌లో సమీరా పుట్టినరోజు వేడుకలు అంగరంగ వైభవంగా

- వెలుగుమట్ల అర్బన్ పార్క్‌లో సమీరా పుట్టినరోజున మొక్కలు నాటిన తల్లిదండ్రులు



**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** ఖమ్మం నగర సమీపంలోని వెలుగుమట్ల అర్బన్ పార్క్‌లో కూతురు సమీరా పుట్టినరోజు వేడుకలను పర్యావరణహితంగా,ఆదర్శవంతంగా నిర్వహించారు.ఈ సందర్భంగా సమీరా తల్లిదండ్రులు షేక్ మీరా, సైదాబీ తమ ముద్దుల కూతురు జన్మదినాన్ని పురస్కరించుకుని పార్క్ ప్రాంగణంలో మొక్కలు నాటారు.ప్రజా జ్యోతి పత్రిక ఖమ్మం జిల్లా బ్యూరో ,ప్రెస్ క్లబ్ అధ్యక్షులు అంతోటి శ్రీనివాస్ ఇచ్చిన పిలుపు, సూచన మేరకు ఈ వినూత్న కార్యక్రమాన్ని చేపట్టినట్లు తల్లిదండ్రులు తెలిపారు. తమ చిన్నారి పుట్టినరోజునా సమాజానికి,పర్యావరణానికి మేలు చేసేలా మొక్కలు నాటడం ఎంతో తృప్తిని ఇచ్చిందని, తమ కుటుంబ సభ్యులందరికీ ఇది ఎనలేని సంతోషాన్ని, ఆనందాన్ని కలిగించిందని తమ భావాలను వ్యక్తపరిచారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆర్టిజం అధినేత డాక్టర్ ఆకుల లక్ష్మి మాట్లాడుతూ, చిన్నారి సమీరా పుట్టినరోజు వేడుకల్లో భాగంగా మొక్కలు నాటే మంచి కార్యక్రమంలో పాల్గొనడం తనకెంతో సంతోషంగా ఉందని తెలిపారు. మనుషుల జీవితంలో వేడుకలు మాత్రమే కాకుండా, పర్యావరణాన్ని కాపాడేలా ఇలాంటి సామాజిక బాధ్యతాయుత కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని అన్నారు.సమాజంలో ప్రతి ఒక్కరూ తమ పిల్లల పుట్టినరోజులు,వార్షికోత్సవాలు లేదా ఇతర శుభకార్యాల సందర్భంగా కనీసం ఒక మొక్కనైనా నాటి పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలని డాక్టర్ ఆకుల లక్ష్మి పిలుపునిచ్చారు.భవిష్యత్తు తరాలకు స్వచ్ఛమైన గాలిని,పచ్చని వాతావరణాన్ని అందించడానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని కోరారు.ఈ కార్యక్రమంలో చిన్నారి సమీరా,ఆమె తల్లిదండ్రులు షేక్ మీరా–సైదాబీ, ఆర్టిజం అధినేత డాక్టర్ ఆకుల లక్ష్మి,టచ్ రాకేష్ రెడ్డి,ప్రెస్ క్లబ్ అధ్యక్షులు అంతోటి శ్రీనివాస్, ప్రజా జ్యోతి పత్రిక విలేకర్ దుబ్బాక శ్రీనివాస్ కుటుంబ సభ్యులు, పర్యావరణ ప్రేమికులు తదితరులు పాల్గొని చిన్నారి సమీరాకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు.

# యువత మారితేనే దేశ భవిష్యత్తు మారుతుంది

- గంజాయి, డ్రగ్స్‌కు దూరంగా ఉండి పోరాట స్ఫూర్తితో ముందుకు సాగాలి
- విద్యార్థి–యువజన ఉద్యమాలే సమాజానికి మార్గదర్శకం: ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి మామిండ్ల శ్రీనాథ్ రెడ్డి
- వైభవంగా ఏఐవైఎఫ్ 22వ నేలకొండపల్లి మండల మహాసభలు – నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక




**నేలకొండపల్లి, జూలై 27 ప్రజా జ్యోతి:** నేటి యువత దేశ భవిష్యత్తుకు పునాది అని, యువత సరైన దిశలో నడిస్తేనే సమాజంలో సానుకూల మార్పులు సాధ్యమవుతాయని ఏఐవైఎఫ్ (ఆల్ ఇండియా యూత్ ఫెడరేషన్) ఖమ్మం జిల్లా సహాయ కార్యదర్శి మామిండ్ల శ్రీనాథ్ రెడ్డి అన్నారు. గంజాయి, డ్రగ్స్, మద్యం వంటి దురలవాట్లకు దూరంగా ఉండి, భగత్ సింగ్ ఆశయాలను ఆదర్శంగా తీసుకుని అన్యాయాలపై ప్రశ్నించే చైతన్యవంతులుగా ఎదగాలని యువతకు పిలుపునిచ్చారు.ఆదివారం ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం భైరవునిపల్లి గ్రామంలో పాలపాటి అశోక్ అధ్యక్షతన నిర్వహించిన ఏఐవైఎఫ్ 22వ మండల మహాసభల్లో ఆయన మాట్లాడారు....యువత నేడు మత్తు పదార్థాల వ్యసనాల బారిన పడటం ఆందోళనకరమని, ఉపాధి అవకాశాల కొరత, సరైన మార్గదర్శకత్వం లేకపోవడం వల్ల కొందరు యువకులు నేరాల వైపు మళ్లుతున్నారని ఆయన పేర్కొన్నారు. గ్రామాలు, పట్టణాలు అనే తేడా లేకుండా గంజాయి, డ్రగ్స్ వ్యాపారం విస్తరిస్తోందని, దీనిని అరికట్టేందుకు సమాజం మొత్తం బాధ్యత తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి యువకుడు తన జీవితాన్ని, కుటుంబాన్ని కాపాడుకోవాలంటే ఈ వ్యసనాలకు పూర్తిగా దూరంగా ఉండాలని సూచించారు.చదువుకున్న యువతకు తగిన ఉద్యోగాలు లేకపోవడం, ఉద్యోగ నోటిఫికేషన్లు ఆలస్యమవడం, నిర్వహించిన పరీక్షల్లో పేపర్ లీకేజీలు చోటుచేసుకోవడం వల్ల లక్షలాది మంది నిరుద్యోగులు తీవ్ర మానసిక వేదన అనుభవిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యల ముందు తలవంచడం కంటే ప్రజాస్వామ్య పద్ధతుల్లో పోరాడటం ద్వారానే హక్కులు సాధించవచ్చని స్పష్టం చేశారు.ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద విద్యార్థులు, యువత చేపట్టిన ఉద్యమాలు దేశవ్యాప్తంగా చైతన్యం తీసుకొచ్చాయని, ఆ పోరాటాల ఫలితంగానే కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సి వచ్చిందని పేర్కొన్నారు. అయితే రాజీనామాతో సమస్యలు ముగిసిపోవని, విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు.వరుస పరీక్షా అక్రమాలకు కేంద్రంగా మారిన నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ)ను వెంటనే రద్దు చేయాలని, నూతన జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ–2020)ను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఉద్యమాల్లో గాయపడిన విద్యార్థులకు ఉచిత వైద్యం అందించడంతో పాటు, పేపర్ లీకేజీలు, ఆందోళనల కారణంగా ప్రాణాలు కోల్పోయిన విద్యార్థుల కుటుంబాలకు రూ.1 కోటి పరిహారం, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలను వెంటనే భర్తీ చేసి నిరుద్యోగులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.మహాసభ అనంతరం ఏఐవైఎఫ్ నేలకొండపల్లి మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పాలపాటి అశోక్ ప్రధాన కార్యదర్శిగా, ఆలేటి ఉమామహేష్ అధ్యక్షుడిగా, పెదపాక నాగరాజు సహాయ కార్యదర్శిగా, గోపినాథ్ ఉపాధ్యక్షుడిగా, మరో 19 మంది కౌన్సిల్ సభ్యులుగా ఎన్నికయ్యారు.నూతనంగా ఎన్నికైన బాధ్యులు మాట్లాడుతూ, మండలంలో గంజాయి, డ్రగ్స్ వంటి సామాజిక రుగ్మతలపై విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టడంతో పాటు విద్యార్థులు, నిరుద్యోగ యువత సమస్యల పరిష్కారానికి మరింత ఉత్సాహంగా ఉద్యమాలు నిర్వహిస్తామని తెలిపారు.ఈ మహాసభలో సీపీఐ మండల కార్యదర్శి మారిశెట్టి వెంకటేశ్వరరావు, ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శులు చింతల రమేష్, మల్లెబోయిన ఉపేందర్, సీపీఐ గ్రామ శాఖ కార్యదర్శి బాలిన కృష్ణంరాజు, భద్రాజీ వెంకటేశ్వరరావుతో పాటు వివిధ గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో యువత పాల్గొన్నారు.

# భూగర్భజలాల పెంపునకు ప్రణాళికలు



**నేలకొండపల్లి, జులై 27 ప్రజా జ్యోతి** :భూగర్భజలాల పెంపునకు అవసరమైన ప్రణాళికలను సిద్ధం చేయాలని నేలకొండపల్లి ఎంపీడీఓ యం.యర్రయ్య సూచించారు. జల సిరి కార్యక్రమం పై మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ప్రత్యేక సమావేశం ను నిర్వహించారు. ఎల్నినో ప్రభావం భవిష్యత్ లో ఇలాంటి విపత్తు నుంచి గట్టేక్కేందుకు వర్షపు నీటి చుక్క ను ఒడిసి పట్టాల్సిందేనన్నారు. ప్రతీ గ్రామంలో ఇంకుడు గుంతలు, పంట కుంటలు, వ్యక్తిగత ఇంకుడు గుంతలు తప్పకుండా ఏర్పాటు చేసుకోవాల్సిందేనన్నారు. నీటి సంరక్షణ చేపట్టేలా ప్రత్యేక కార్యచరణ రూపకల్పన చేసుకోవాలని సూచించారు. వర్షపు నీటిని వృధా కాకుండా భూమిలోకి ఇంకడం వలన భూగర్భజలాలు గణనీయంగా పెరుగుతాయని అన్నారు. ప్రజలకు, రైతులకు అవగాహన కల్పించి ''ఇంకుడు గుంతలు నిర్మించేలా కౌన్సిలింగ్ చేయాలని సూచించారు. ఆగస్టు 15 లోపు పనులను పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జల సిరి విషయంలో నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు.. ఈ సమావేశంలో మండల పంచాయతీ అధికారి సి.హెచ్.శివ, ఈజీఎస్ ఏపీవో ఆర్.సునీత, పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# జర్మనీలో ఉద్యోగం లక్ష్యంగా నర్సింగ్, ఫిజియోథెరపీ అభ్యర్థులకు ఉచిత జర్మన్ భాషా శిక్షణ

- జిల్లా ఉపాధి అధికారిణి మాధవి

**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** ఉమ్మడి ఖమ్మం జిల్లా నిరుద్యోగ యువతీ, యువకులకు జర్మనీలో ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో జిల్లా ఉపాధి కార్యాలయం టామ్ కామ్ ఆధ్వర్యంలో నర్సింగ్,ఫిజియోథెరపీ కోర్సులు పూర్తి చేసిన అభ్యర్థులకు ఉచితంగా జర్మన్ భాషా శిక్షణ కార్యక్రమాన్ని త్వరలో ప్రారంభించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారిణి ఎన్.మాధవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.జర్మనీలో వైద్య రంగంలో అర్హత కలిగిన నర్సింగ్, ఫిజియోథెరపీ నిపుణులకు పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకొని ఈ శిక్షణా కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. జర్మన్ భాషలో నైపుణ్యం సాధించడం ద్వారా విదేశాల్లో మెరుగైన ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకునేందుకు ఈ శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు.జర్మన్ భాషా శిక్షణ పూర్తయిన అనంతరం నిర్వహించే అర్హత పరీక్షలో ఉత్తీర్ణులైన అభ్యర్థులకు జర్మనీలో ఉద్యోగ అవకాశాల కోసం షరతులతో కూడిన ఉద్యోగ ఎంపిక ధ్రువీకరణ పత్రం అందజేయనున్నట్లు తెలిపారు.ఈ అవకాశాన్ని ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిధిలోని నర్సింగ్,ఫిజియోథెరపీ కోర్సులు పూర్తి చేసిన నిరుద్యోగ యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆసక్తి గల అభ్యర్థులు జిల్లా ఉపాధి కార్యాలయంలో తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు.మరిన్ని వివరాల కోసం ఖమ్మం కలెక్టరేట్ మొదటి అంతస్తులోని ఎఫ్ –18 లోని జిల్లా ఉపాధి కార్యాలయాన్ని సంప్రదించాలని జిల్లా ఉపాధి అధికారిణి ఎన్. మాధవి తెలిపారు.

## ఘనంగా పగడాల మంజుల పుట్టిన రోజు వేడుకలు

- పలువురు శుభాకాంక్షలు తెలిపారు.



**కారేపల్లి, జూలై 27, ప్రజా జ్యోతి:** కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలు, మాజీ రాష్ట్ర మహిళా సంఘం నాయకురాలు, ఖమ్మం జిల్లా మున్నూరు కాపు సంఘం ముద్దుబిడ్డ,ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షురాలు పగడాల మంజుల జన్మదిన వేడుకలు కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం ఘనంగా నిర్వహించారు.కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఖమ్మం జిల్లా వాణిజ్య విభాగపు ఉపాధ్యక్షులు సురేందర్ మణియర్ ఆధ్వర్యంలో పగడాల మంజుల పుట్టినరోజుని పురస్కరించుకొని కేక్ కట్ చేసి స్వీట్లు పంచుకుని శుభాకాంక్షలు తెలిపారు.పార్టీ అభివృదే ధ్యేయంగా , రాజకీయాలకతీతంగా ప్రజా సేవ చేస్తూ, నిరంతరం ప్రజా సమస్యలపై పోరాడే నాయకురాలు పదవులు ముఖ్యం కాదు ప్రజా సేవే ముఖ్యమని, కుటుంబ అభివృద్ధి కంటే పేద ప్రజల అభివృద్ధి, పార్టీ అభివృద్ధి ముఖ్యదేయమని భావించి నిరంతరం కృషి చేస్తున్న ఆమె మరెన్నో పుట్టినరోజు వేడుకలు జరుపుకోవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో సింగరేణి మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు భూక్య రంజిత్ కుమార్,సర్పంచ్ పొడుగు పెంటయ్య,ఉప సర్పంచ్ తాటి రామారావు,ఆత్మ కమిటీ డైరెక్టర్ గుండ్ల జగన్నాథం,బిసి సెల్ అధ్యక్షుడు బోళ్ల రమేష్,మాజీ సొసైటీ డైరెక్టర్ ఆదేర్ల రాములు,మైనార్టీ సెల్ తాజుద్దీన్,మాజీ కోఆప్షన్ సభ్యులు హనీఫ్,మైనారిటీ జిల్లా నాయకులు మజీద్ పాషా,గ్రామ శాఖ అధ్యక్షుడు చాగంటి చిన్న వెంకటేశ్వర్లు,తుడుం దెబ్బ జిల్లా నాయకులు కురుసం సత్యనారాయణ, వైరా సోషల్ మీడియా కన్వీనర్ కనకం పవన్ కళ్యాణ్, సన్నీ,వేమూరి తామస్ తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

## అమెరికాలో పగడాల మంజుల పుట్టిన రోజు వేడుకలు.



**కారేపల్లి, జూలై 27, ప్రజా జ్యోతి:** సింగరేణి మండలానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకురాలు, ఖమ్మం జిల్లా మున్నూరు కాపు సంఘం ముద్దుబిడ్డ పగడాల మంజుల పుట్టినరోజు వేడుకలను సోమవారం అమెరికాలో ఘనంగా నిర్వహించారు. పగడాల మంజుల –మోహన్ కృష్ణ దంపతులు అమెరికా పర్యటన నిమిత్తం గత పది రోజుల క్రితం అమెరికా వెళ్లారు. అక్కడ వారి కుమారుడు కుమార్తె, వారి బంధువులు, తెలుగు వారి సమక్షంలో పుట్టినరోజు వేడుకలను కేక్ కట్ చేసి స్వీట్లు పంచి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు సింగరేణి మండల రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు,అఖిలపక్ష నాయకులు, అభిమానులు ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.

## మూడు నెలల వేతనాలు విడుదల చేయాలని ఫీల్డ్ అసిస్టెంట్ల వినతి



**రఘునాధపాలెం ప్రజా జ్యోతి** ఖమ్మం జిల్లా,రఘునాధపాలెం మండలంలో విధులు నిర్వహిస్తున్న ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లకు మూడు నెలలుగా వేతనాలు అందడం లేదని, బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరుతూ సోమవారం ఎంపీడీఓ, అశోక్ కుమార్ కు వినతిపత్రం అందజేశారు. మూడు నెలలుగా జీతాలు అందక కుటుంబ పోషణ, పిల్లల విద్య, నిత్యావసర ఖర్చులు నిర్వహించడం కష్టంగా మారిందని వారు తెలిపారు. పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించడంతో పాటు ఇకపై ప్రతి నెలా సకాలంలో జీతాలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. తమ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ల మండల అధ్యక్షులు బరిగేల కోటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి తూరిగంటి సూర్యం, మండల కార్యదర్శి భూక్యా బాలాజీ, ప్రసాద్, రవి, నాగుల మీరా, శ్రీను, భద్రు,ఉపేందర్, మస్తాన్, వెంకటేశ్వర్లు, శారద, రమాదేవి, శ్రీదేవి పాల్గొనడం జరిగింది.

## సమిష్టి కృషితో బొగ్గు బ్లాక్ లను సాధించుకుందాం.. ఐ.ఎన్.టి.యు.సి

- ఐఎన్టియుసి కోర్ కమిటీ సమావేశం
- ఉప ప్రధాన కార్యదర్శి తీగల క్రాంతి కుమార్



**సత్తుపల్లి జూలై27(ప్రజా జ్యోతి)** తెలంగాణ రాష్ట్రం మినిమం వేజెస్ అడ్వైజరీ బోర్డ్ చైర్మన్ , ఐఎన్టీయూసీ సెక్రెటరీ జనరల్ జనక్ ప్రసాద్ అధ్యక్షతన గోదావరిఖనిలో సోమవారం సింగరేణి ప్రస్తుత పరిస్థితులు , నూతన బొగ్గు గనుల సాధన , పెండింగ్ హామీల అమలు , 12వ జెబిసిసిఐ వేజ్ బోర్డు ఏర్పాటు అంశాలపై,కోర్ కమిటీ సమావేశం నిర్వహించారు.ఈ సమావేశానికి ఐఎన్టియుసి సెంట్రల్ కమిటీ నాయకులు ఐఎన్టీయూసీ ఉప ప్రధాన కార్యదర్శి తీగల క్రాంతి కుమార్ , సింగరేణి 12 ఏరియాలో వైస్ ప్రెసిడెంట్లు , కోర్ కమిటీ సభ్యులు హాజరయ్యారు. సమావేశంలో సింగరేణి సంస్థ అభివృద్ధి కోసం కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో మరిన్ని బొగ్గు బ్లాకులను సాధించేందుకు సమిష్టిగా కృషి చేయాలని కోరారు. అలాగే కార్మికుల దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని 12వ జేబీసీసీఐ వేజ్ బోర్డును తక్షణమే ఏర్పాటు చేసి వేతన సవరణ ప్రక్రియను ప్రారంభించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరాలని తీర్మానించారు.అదేవిధంగా కార్మికులకు సంబంధించిన పెండింగ్ హామీల అమలు , ఆదాయ పన్ను రాయితీ , సొంత ఇంటి పథకం అమలు, మారు పేర్లు, విజిలెన్స్‌కు సంబంధించిన సమస్యల పరిష్కారం ,నూతన బొగ్గు గనుల కేటాయింపు వంటి అంశాలపై సమగ్రంగా చర్చించారు. సింగరేణి ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంపొందించడం, సంస్థ విస్తరణ, ఉద్యోగ అవకాశాల కల్పన, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం, కార్మిక సంక్షేమ పథకాల సమర్థవంతమైన అమలు, కాంట్రాక్ట్ కార్మికుల సమస్యల పరిష్కారం, గనుల్లో భద్రతా ప్రమాణాల మెరుగుదల తదితర అంశాలపై కూడా విస్తృతంగా చర్చించి పలు నిర్ణయాలు తీసుకున్నారు.అలాగే యూనియన్ కార్యకర్తలకు శిక్షణా కార్యక్రమాలు నిర్వహణ, హైదరాబాద్‌లో నిర్వహించనున్న మహాసభలకు సంబంధించిన కార్యాచరణను రూపొందించడం , అన్ని ఏరియాల్లో అవగాహన సమావేశాలు నిర్వహించడం , ప్రజాప్రతినిధులు , కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి కార్మికుల సమస్యలను తీసుకెళ్లడం వంటి పలు కీలక అంశాలపై పూర్ కమిటీలో చర్చించారని తెలియజేశారు.కోర్ కమిటీ సబ్యులు త్యాగరాజన్ , ఆల్బర్ట్ , రజాక్ , పితాంబర్రావు , కృష్ణంరాజు , కోటేశ్వరరావు పాల్గొన్నారు.

## క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ చట్టం నిబంధనలను ఖచ్చితంగా అమలు చేయాలి

- అదనపు కలెక్టర్ డాక్టర్ శ్రీజ
- వైద్య సంస్థలకు రెన్యువల్,రిజిస్ట్రేషన్‌కు ముందు సమగ్ర తనిఖీలు నిర్వహించాలి
- జిల్లా స్థాయి మల్టీ మెంబర్ అప్రోప్రియేట్ అథారిటీ కమిటీ సమావేశంలో అధికారులకు ఆదేశాలు



**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ చట్టం–2010 ప్రకారం వైద్య సంస్థల నమోదు, పునరుద్ధరణ ప్రక్రియలో నిబంధనలను ఖచ్చితంగా అమలు చేయాలని అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ సంబంధిత అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా స్థాయి మల్టీ మెంబర్ అప్రోప్రియేట్ అథారిటీ కమిటీ సమావేశంలో అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ పాల్గొని జిల్లా లోని వైద్య సంస్థల రిజిస్ట్రేషన్,పునరుద్ధరణ, నిబంధనల అమలు అంశాలపై సమీక్షించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ మాట్లాడుతూ వైద్య సంస్థలకు రిజిస్ట్రేషన్ లేదా రెన్యువల్ మంజూరు చేసే ముందు ప్రతి ఆసుపత్రిని క్షేత్రస్థాయిలో పూర్తి స్థాయిలో తనిఖీ చేయాలని అధికారులను ఆదేశించారు.క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ చట్టంలోని అన్ని నిబంధనలు తప్పనిసరిగా అమలవుతున్నాయో లేదో పరిశీలించాలని, తనిఖీల్లో ఏవైనా లోపాలు గుర్తించినట్లయితే సంబంధిత ఆసుపత్రి యాజమాన్యానికి నోటీసులు జారీ చేసి, నిర్దిష్ట గడువులోగా వాటిని సరిదిద్దేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. లోపాలను సరిచేయని వైద్య సంస్థలకు రెన్యువల్ మంజూరు చేయ రాదని స్పష్టం చేశారు.ప్రతి వైద్య సంస్థలో రోగులు, వారి సహాయకుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని పార్కింగ్ సౌకర్యం తప్పనిసరిగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నోటీసులు అందుకున్న వైద్య సంస్థలు లోపాలను సరిదిద్దిన అనంతరం కరెక్షన్ రిపోర్టులను సంబంధిత అధికారులకు సమర్పించాలని సూచించారు.ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (పీహెచ్‌సీలు), ఉప ఆరోగ్య కేంద్రాల్లో అత్యవసర మరమ్మతులు చేపట్టేందుకు అవసరమైన సామగ్రి, పనుల అంచనాలను సిద్ధం చేసి వెంటనే సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.సమావేశంలో జిల్లాలోని వైద్య సంస్థల రిజిస్ట్రేషన్ స్థితిగతులను అధికారులు వివరించారు. జిల్లాలో ఆయుష్ కేంద్రాలు, డయాగ్నస్టిక్ సెంటర్లు, ఆసుపత్రులు, క్లినిక్‌లు, దంత వైద్యశాలలు కలిపి మొత్తం 689 వైద్య సంస్థలు నమోదు కాగా,వాటిలో 595 యాక్టివ్, 94 ఇన్‌యాక్టివ్ గా ఉన్నట్లు తెలిపారు. ఇప్పటివరకు 47 ప్రొవిజనల్ సర్టిఫికెట్లు జారీ చేయగా, 9 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, అలాగే 25 శాశ్వత సర్టిఫికెట్లు జారీ చేయగా, 4 దరఖాస్తులు తిరస్కరించబడి, 21 దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయని, మరో 12 దరఖాస్తులు ట్రాఫిక్ క్లియరెన్స్ కోసం పోలీసు శాఖ వద్ద, 12 దరఖాస్తులు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ (డీఎంహెచ్ఓ) వద్ద పెండింగ్‌లో ఉన్నట్లు సమావేశంలో వివరించారు.ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రామారావు, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఎల్. వేణుగోపాల్ రెడ్డి,ఐఎంఏ ప్రెసిడెంట్,ఏసిపి,తెలంగాణ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు మెంబర్, డిప్యూటీ డిఎంహెచ్ఓ., కమిటీ సభ్యులు,సంబంధిత శాఖల అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

## రైతులు క్రాప్ హాలిడే పాటించాలి

- నీటి అవకాశమున్న రైతులు ఆరుతడి పంటలు మాత్రమే వేసుకోవాలి.
- డిఈ ఈ బానోతు వెంకన్న.



**కారేపల్లి, జూలై 27, ప్రజా జ్యోతి:** రైతు సోదరులు ఈ సంవత్సరం క్రాఫ్ హాలిడే పాటించాలి, నీటి అవకాశమున్న రైతులు ఆరుతడి పంటలు మాత్రమే వేసుకోవాలని ఇరిగేషన్ డి ఈ ఈ భానోత్ వెంకన్న అన్నారు. సోమవారం సింగరేణి మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూభారత వాతావరణ శాఖ అంచనాల ప్రకారం, ఈ సంవత్సరం ఎల్ నినో ప్రభావం కారణంగా వర్షపాతం సాధారణం కంటే తక్కువగా ఉండే అవకాశం ఉందని సూచించబడింది. ఈ నేపథ్యంలో సింగరేణి మండల పరిధిలోని చెరువులు ఆశించిన స్థాయిలో నిండే పరిస్థితులు కనిపించడం లేదు. సింగరేణి మండల పరిధిలో మొత్తం 107 చెరువులు ఉన్నాయి. వీటి కింద సుమారు 7500 ఎకరాల ఆయకట్టు సాగులో ఉంది. మన మండలంలోన తక్కువ చెరువులు చైన్–లింక్ చెరువులు కావడం వల్ల పై చెరువుల నుండి క్రింది చెరువులకు నీటిని తరలించే అవకాశం కూడా తక్కువ, రాబోయే వర్షం వల్ల వచ్చే నీటి నిల్వలను సక్రమంగా సంరక్షించగలిగితేనే, సింగరేణి మండలంలోని అన్ని గ్రామాలకు ఈ సంవత్సరం మొత్తం తాగునీటి అవసరాలను తీర్చే అవకాశం ఉంటుంది.మండలం లో వర్షం ఆధారిత చెరువులు తప్ప వేరే ఎటువంటి ప్రత్యామ్నాయ అవకాశం లేదు.ప్రస్తుతం మండలంలో భూగర్భ జలమట్టం సాధారణ స్థాయితో పోలిస్తే సుమారు ఒక మీటరు వరకు తగ్గి ఉండటం ఆందోళనకర విషయం, ఈ పరిస్థితి వచ్చేఎండాకాలం వరకు కొనసాగే అవకాశం ఉన్నందున ప్రతి నీటి బొట్టును అత్యంత విలువైనదిగా భావించి సంరక్షించుకోవాల్సిన అవసరం ఉందనీ అన్నారు.చెరువుల కింద పూర్తి ఆయకట్టుకు ఒక పంటకాలం పాటు సాగునీరు ఇవ్వలేని పరిస్థితి ఉంది అందువల్ల, స్వంతంగా తగినంత నీటి వనరులు (పెద్ద బోర్లు లేదా బావులు) కలిగిన రైతులు మాత్రమే ఆరుతడి లేదా ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయడం మంచిది. పూర్తిగా చెరువుల నీటిపైనే ఆధారపడిన ప్రతి గ్రామంలోని చెరువు ఆయకట్టు రైతులందరూ గ్రామ స్థాయిలో పరస్పర అవగాహనతో, ఐకమత్యంతో నిబద్ధతతో ఈ పంటకాలానికి స్వచ్ఛందంగా "క్రాప్ హాలిడే" పాటించాలని విజ్ఞప్తి చేశారు. చెరువు ఆయకట్టు రైతులందరూ సమష్టిగా ఈ నిర్ణయాన్ని పాటించినప్పుడే చెరువులలోని నీటిని సంరక్షించి, భూగర్భ జలాలను పరిరక్షించడంతో పాటు గ్రామ ప్రజల తాగునీటి అవసరాలను సంవత్సరం పొడవునా భద్రపరచడం సాధ్యమవుతుందని తెలిపారు. రైతులు, ప్రజాప్రతినిధులు, గ్రామపంచాయతీలు, సంబంధిత అన్ని శాఖలు సమన్వయంతో వ్యవహరించి చెరువులలో ప్రస్తుతం ఉన్న నీటిని ఏ విధంగానూ బయటకు విడుదల చేయకుండా భవిష్యత్ తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకొని సంరక్షించాలని సూచించారు. అలాగే చేపల వేట కోసం గానీ, పంటల సాగు కోసం గానీ తూములు తెరవడం, మోటార్ల ద్వారా చెరువులలోని నీటిని బయటకు తోడడం లేదా చెరువు శిఖం పరిధిలోని బోర్ల ద్వారా నీటిని వినియోగించడం వంటి చర్యలకు ఎట్టి పరిస్థితుల్లోనూ పాల్పడకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతతో సహకరించాలని పేర్కొన్నారు.

# విద్యార్థులకు పౌష్టిక అల్పాహారం పంపిణీ

- **హరే రామ హరే కృష్ణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాగి ఇడ్లీ, సాంబారు అందజేత**



**బోనకల్, జులై 27(ప్రజా జ్యోతి):** విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణతో పాటు వారి పోషకాహార స్థాయిని మెరుగుపరిచే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం, హరే రామ హరే కృష్ణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు పౌష్టికాహారం అందించే కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. ఇందులో భాగంగా బోనకల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అల్పాహారంగా రాగి ఇడ్లీ, సాంబారు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో బోనకల్ ఉప సర్పంచ్ బాణావత్ కొండ, గ్రామపంచాయతీ సిబ్బంది, కళాశాల ప్రిన్సిపల్ లింగమనేని నళిని శ్రీ పాల్గొని విద్యార్థులకు స్వయంగా అల్పాహారం అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... విద్యార్థులకు సమతుల్యమైన పౌష్టికాహారం అందించడం ద్వారా వారి శారీరక, మానసిక వికాసానికి తోడ్పాటు లభిస్తుందని తెలిపారు. రాగి వంటి పోషక విలువలు అధికంగా ఉన్న ఆహార పదార్థాలను అందించడం వల్ల విద్యార్థుల్లో ఆరోగ్యం మెరుగుపడి, చదువుపై ఏకాగ్రత పెరుగుతుందని పేర్కొన్నారు.విద్యార్థులు ఈ కార్యక్రమంపై ఆనందం వ్యక్తం చేస్తూ, ప్రభుత్వానికి హరే రామ హరే కృష్ణ ఫౌండేషన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కళాశాలలో ఇలాంటి పౌష్టికాహార కార్యక్రమాలు నిరంతరం కొనసాగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో అధ్యాపకులు జోనతాన్ బాబు, రాజేంద్ర కుమార్, లక్ష్మీకాంతం పద్మావతి, రామకృష్ణ, రమేష్, రాజేంద్ర, తిరుపతి రావు, ప్రియ కుమార్ రెడ్డి, మురళీకృష్ణ, యశోద, శాంతి ప్రియ, లైబ్రరీన్ మోహన్, యుడిసి మదర్ సాహెబ్, జశ్వంత్, బుజ్జమ్మ, అరుణ మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## ఐదు ఎకరాల లోపు రైతులకు 100% సబ్సిడీతో ఫామ్ పాండ్లు

- **జలసిరి పథకంపై మండల స్థాయి సమీక్ష సమావేశం.**
- **ప్రతి రైతుకు నీటి గుంట - ప్రతి ఇంటికి ఇంకుడు గుంత లక్ష్యంగా ప్రభుత్వం.**
- **40 గ్రామపంచాయతీల్లో 20 వేల మంది రైతుల జాబ్ కార్డుల పరిశీలన.**
- **అర్హులైన రైతులకు వికసిత్ భారత్ పథకం కింద ఫామ్ పాండ్ నిర్మాణం.**
- **ఆగస్టు 15లోపు మంజూరైన అన్ని యూనిట్ల నిర్మాణం పూర్తి చేయాలని సూచన.**





**తిరుమలయపాలెం, ప్రజా జ్యోతి** జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు, ఏసీఎల్బీ ఆఫీసర్ శ్రీజ సూచనలతో మండల కేంద్రంలో అగ్రికల్చర్ ఏఈఓలు, టీఏలు, ఎఫ్ఏలతో మండల అభివృద్ధి అధికారి షేక్ సిలార్ సాహెబ్ సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న "జలసిరి – ప్రతి రైతుకు నీటి గుంట, ప్రతి ఇంటికి ఇంకుడు గుంత" కార్యక్రమంపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఐదు ఎకరాల లోపు భూమి కలిగిన రైతులను గుర్తించి, వారికి 100 శాతం సబ్సిడీతో ఫామ్ పాండ్ (నీటి గుంట ) నిర్మించి అందించేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.మండలంలోని 40 గ్రామపంచాయతీల పరిధిలో సుమారు 20 వేల మంది రైతుల జాబ్ కార్డులను క్షుణ్ణంగా పరిశీలించి, అర్హులైన ప్రతి రైతుకు వికసిత్ భారత్ పథకం కింద ఫామ్ పాండ్ నిర్మాణం చేపట్టనున్నట్లు వెల్లడించారు.గ్రామాల పాలక మండళ్లు, గౌరవ సర్పంచులు ఈ కార్యక్రమంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని, తమ గ్రామాలకు మంజూరైన అన్ని యూనిట్ల నిర్మాణాన్ని ఆగస్టు 15లోపు పూర్తి చేయడానికి సహకరించాలని అధికారులు కోరారు. అర్హులైన రైతులు మరిన్ని వివరాల కోసం తమ గ్రామ పంచాయతీ కార్యదర్శిని సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సిలార్ సాహెబ్, వ్యవసాయ అధికారి సీతారామరెడ్డి, ఎంపీవో షైక్ మీరా, ఏపీవో నర్సిహారావ్, అగ్రికల్చర్ ఏఈఓలు, టీఏలు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

## ఏపీ నుంచి అక్రమంగా తరులుతున్న ఇసుక టిప్పర్లు పట్టివేత

- **నలుగురు పై కేసు నమోదు...రెండు టిప్పర్లు సీజ్**
- **ఎస్సై శ్రీనివాస్ రెడ్డి.**






**నేలకొండపల్లి, జులై 27 ప్రజాజ్యోతి:** ఏపీ నుంచి తెలంగాణ కు ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు టిప్పర్లు ను స్థానిక పోలీసులు పట్టుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఏపీ నుంచి తెలంగాణ లోని సూర్యాపేట జిల్లా, కోదాడ కు ఆక్రమంగా రెండు ఇసుక టిప్పర్లు సోమవారం వస్తున్నాయి. ఇసుకకు ఎలాంటి అనుమతులు తీసుకోకుండా ఏపీ నుంచి వయా నేలకొండపల్లి మీదుగా కోదాడ వస్తున్నాయి. స్థానీక పోలీసులు చెరువుమాధారం క్రాస్ రోడ్ వద్ద తనీఖీలలో పట్టుబడ్డారు. రెండు టిప్పర్లు ను సీజ్ చేయటంతో పాటు, టిప్పర్ల ఓనర్లు, మరియు డ్రైవర్ల మొత్తం నలుగురు పై కేసు నమోదు చేశారు.

## జలసిరి పథకంపై గ్రామ స్థాయి సమీక్ష సమావేశం

- **ప్రతి రైతుకు నీటి గుంట ప్రతి ఇంటికి ఇంకుడు గుంత లక్ష్యంగా ప్రభుత్వం**



**చింతకాని, జూలై 27 ప్రజా జ్యోతి** చింతకాని మండలం లోని తిరుమలాపురం గ్రామపంచాయతీ కార్యాలయంలో సోమవారం జలసిరి కార్యక్రమంలో భాగంగా గ్రామసభ నిర్వహించారు. ఈ గ్రామసభకు ముఖ్య అతిథిగా సర్పంచ్ చాపలమడుగు వీరబాబు హాజరై నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపు, వ్యవసాయాభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా వ్యవసాయ కుంటలు,బోర్‌వెల్ రీఛార్జ్ కుంటలు,కమ్యూనిటీ ఇంకుడు కుంటల నిర్మాణం ద్వారా వర్షపు నీటిని నిల్వ చేసి భూగర్భ జలాలను పెంపొందించడంతో పాటు రైతులకు సాగునీటి సమస్యలను తగ్గించవచ్చని వివరించారు. ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరించి ప్రతి గ్రామస్థుడు నీటి సంరక్షణలో భాగస్వామి కావాలని సర్పంచ్ పిలుపునిచ్చారు.గ్రామాభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ, భవిష్యత్ తరాలకు నీటి వనరులను కాపాడేందుకు జలసిరి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి ఉమారాణి,గోగుల నరసింహారావు,బండి సైదులు, మడిపల్లి నారాయణ,మడిపల్లి సైదులు,మరీదు మధు,భూపతి రావు,మరీదు రాము,చింతల రామకృష్ణ,గోదా ప్రసాద్, గ్రామపంచాయతీ సిబ్బంది, రైతులు,గ్రామ పెద్దలు,యువత, గ్రామస్థులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలో ఘనంగా అల్పాహార పథకం ప్రారంభం

- **పాల్గొన్న మండల కాంగ్రెస్ అధ్యక్షులు కన్నెబోయిన గోపి సర్పంచ్ ఆవుల నరసింహారావు**



**చింతకాని జులై 27ప్రజాజ్యోతి :** ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని అమలు చేస్తున్న అల్పాహార పథకం కింద బస్వాపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో అల్పాహార కార్యక్రమాన్ని సర్పంచ్ ఆవుల నరసింహ రావు మరియు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కన్నెబోయిన గోపి యాదవ్ తో కలిసి ప్రారంభించారు.అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకు కృతజ్ఞతలు తెలుపుతు విద్యార్థులతో కలిసి మాట్లాడి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల ఆరోగ్యం విద్యాభివృద్ధికి పెద్దపీట వేస్తూ చేపట్టిన అల్పాహార పథకం ఎంతో ప్రయోజనకరమని అన్నారు.ఉదయంపూట పోషకాహారం అందించడంవల్ల విద్యార్థులు ఉత్సాహంగా తరగతులకు హాజరై ఏకాగ్రతతో చదువుకుని మెరుగైనఫలితాలు సాధించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.భవిష్యత్ తరాలను ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దేందుకు ఇటువంటి సంక్షేమకార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం ఇందిర,కుక్కల గోపి,కుక్కల వెంకటేశ్వర్లు, ఉస్మాన్, కన్నెబోయిన పాండు రంగారావు, గ్రామ పెద్దలు మార్గం శ్రీనివాస్,బద్దెల నరసింహారావు, బొల్లా వెంకయ్య,ఆవుల మన్మధరావు, ప్రధానోపాధ్యాయులు, సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

## ఆరుతడి పంటలు, పంట కుంటలు పై అవగాహన



**సత్తుపల్లి జూలై27(ప్రజా జ్యోతి)** మండల పరిధిలోని చెరుకుపల్లి,గంగారం, రామ నగరం, యాతలకుంట కిష్టాపురం గ్రామాలలో రైతులకు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఎల్ నినో ప్రభావం నేపథ్యంలో సాగు చేయవలసిన,ఆరుతడి పంటలు, వ్యవసాయ కుంటల గురించి ఇతర శాఖల సమన్వయంతో అవగాహన కార్యక్రమాలు సోమవారం ఏర్పాటు చేసినారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా ఎల్ ని నో ప్రభావం వలన వర్షపాతం తక్కువగా ఉండి అవకాశం ఉన్నందున, రైతులు నీటి అవసరం తక్కువగా ఉన్న పెసర, మినుము, కంది, నువ్వులు, జొన్నలు వంటి పంటలకు ప్రాధాన్యం ఇవ్వాలని, వ్యవసాయ అధికారులు రైతులకు సూచించారు. బోర్లు ఉన్న రైతులు మొత్తం విస్తీర్ణంలో 50 శాతం మాత్రమే సాగు చేసుకోవాలని తెలిపారు. అదే విధంగా పంట కుంటలు నిర్మాణం చేపట్టడం వల్ల రైతులకు ఏ విధంగా మేలు జరుగుతుందో వివరించారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి డి ఎన్ కె శ్రీనివాసరావు, వ్యవసాయ విస్తరణ అధికారులు ఆశాజ్యోతి, నరేష్, అనూష, సాయి వాసంతి, ఇతర శాఖ అధికారులు పాల్గొన్నారు.

## గాదెపాడులో ఎల్ నినో పై అవగాహన

**కారేపల్లి, జూలై 27, ప్రజా జ్యోతి:** సింగరేణి మండల పరిధిలోని గాదెపాడు గ్రామపంచాయతీలో సోమవారం ఎల్ నినో పై సర్పంచ్ భూక్య రంజిత్ కుమార్ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఈ గ్రామ సభకు ఇరిగేషన్ డి ఈ ఈ భానోత్ వెంకన్న ముఖ్యఅతిథిగా హాజరై ఆయన మాట్లాడుతూ ఈ సంవత్సరం రాష్ట్రంలో ఎల్ నినో ప్రభావం అధికంగా ఉన్నదని భారత వాతావరణ శాఖ వారు తెలిపారు. దీని ప్రభావంతో రైతులు ఆరుతడి పంటలు మాత్రమే వేసుకోవాలి వరి, మిర్చి లాంటి అధిక నీరు వాడకం ఉన్న పంటలు వేయొద్దు. ఆరుతది పంటలైన పెసర, కందులు, జొన్న, మినుము, వేరుశనగ ఇతరత పంటలు వేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలోఏఈ , మినీ పిహెచ్సి మాణిక్యారం సంధ్య ఏఎన్ఎం ఆశా వర్కర్లు, అంగన్వాడీ వర్కర్లు వార్డు మెంబర్లు, రైతులు, మహిళలు పాల్గొన్నారు .



## ఎంపిపిఎస్ పాఠశాలలో విజయవంతంగా అల్పాహార కార్యక్రమం ప్రారంభం

- పాల్గొన్న సర్పంచ్ ఆవుల నాగేశ్వరరావు



**చింతకాని జులై 27ప్రజాజ్యోతి :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల ఆరోగ్యం,పోషకాహారాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న అల్పాహార కార్యక్రమం వందనం గ్రామ ఎంపిపిఎస్ పాఠశాలలో నిర్వహించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఆవుల నాగేశ్వరరావు పాల్గొని విద్యార్థులకు అల్పాహారం పంపిణీ చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ ఆవుల నాగేశ్వరరావు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరియు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రవేశపెట్టిన ఈ అల్పాహార పథకం ఎంతో అభినందనీయమని తెలిపారు. ఖాళీ కడుపుతో పాఠశాలకు వచ్చే విద్యార్థులకు ఉదయాన్నే పౌష్టికాహారం అందించడం వల్ల వారి ఆరోగ్యం మెరుగుపడటమే కాకుండా, చదువుపై ఏకాగ్రత కూడా పెరుగుతుందని చెప్పారు.ఈ గొప్ప సంక్షేమ కార్యక్రమాన్ని అమలు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి,ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కి గ్రామ ప్రజల తరఫున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతం చేసే ఇలాంటి సంక్షేమ కార్యక్రమాలకు గ్రామ పంచాయతీ ఎల్లప్పుడూ సహకరిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో.. స్కూల్ హెచ్ఎం వాణి, గ్రామ పెద్దలు పిల్లలు,తదితరులు పాల్గొన్నారు.

## గ్రామంలో పరిశుభ్రతను పాటించాలి

- బోనకల్ ఉపసర్పంచ్ బానోతు కొండ



**బోనకల్,జూలై 27(ప్రజా జ్యోతి ):** గ్రామంలోని ప్రజలందరూ తమ ఇళ్ల పరిసర ప్రాంతాలలో పరిశుభ్రతను కచ్చితంగా పాటించాలని, గ్రామ పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని బోనకల్ ఉపసర్పంచ్ బానోతు కొండ అన్నారు. సోమవారం బోనకల్ గ్రామపంచాయతీ నందు గ్రామపంచాయతీ పాలకవర్గం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ప్రస్తుతం ఎల్‌నినో ప్రభావం కారణంగా వాతావరణ పరిస్థితులు మారుతున్నాయనీ, ఒక వైపు భారీ వర్షాలు, మరోవైపు నీటి నిల్వ సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉన్నదని అన్నారు. అందుకే గ్రామంలో వర్షపు నీటి నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. మన గ్రామంలోని పాత డ్రైనేజీలు, కాలువలు, ఇంకుడు గుంతలను పూర్తిగా గుర్తించి, అవసరమైన చోట కొత్త డ్రైనేజీ కాలువలు, ప్రజా మురుగు నీటి పారుదల వ్యవస్థలు, వర్షపు నీటి నిల్వ సౌకర్యాలను ఏర్పాటు చేశామన్నారు. ప్రతి ఇంటి యజమాని తన ఇంటి మురుగు నీటిని రోడ్లపైకి వదలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. స్నానం చేసిన నీరు, బట్టలు ఉతికిన నీరు, సోపు నీరు వంటి వ్యర్థ జలాలను ఇంటి వద్దే ఇంకుడు గుంతల ద్వారా భూగర్భంలోకి వెళ్లేలా ఏర్పాటు చేసుకోవాలనీ అన్నారు. ప్రతి కుటుంబం తమ ఇంటి పరిసరాలు, గబ్బులు, డ్రైనేజీలు, నీటి నిల్వ ప్రాంతాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పరిశుభ్రత పాటించడం వల్ల దోమలు, ఈగలు, అంటువ్యాధులు నివారించవచ్చునని అన్నారు.గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్యక్రమాలను 100 శాతం సమర్థవంతంగా అమలు చేస్తామన్నారు. అయితే ప్రభుత్వంతో పాటు గ్రామ ప్రజల సహకారం కూడా అంతే ముఖ్యమైనదనీ అన్నారు.“పరిశుభ్రమైన గ్రామం ,ఆరోగ్యకరమైన జీవనం” అనే లక్ష్యంతో ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు రావాలని కోరారు. మనందరం కలిసి మన గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుకుందామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాయబ్ తాహసిల్దార్ అజ్మీర లక్ష్మణ్, గ్రామపంచాయతీ కార్యదర్శి కోలా రాజేశ్వరి, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఓటు హక్కు పోతే పౌరసత్వమే ప్రశ్నార్థకం

- ఓటు హక్కు పరిరక్షణే ప్రజాస్వామ్యానికి పునాది
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



**మధిర ప్రజా జ్యోతి** భారత రాజ్యాంగం పౌరులందరికీ కల్పించిన ఓటు హక్కును పరిరక్షించడమే ప్రజాస్వామ్యానికి అసలైన సూత్రమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. ఓటర్ల జాబితా సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ప్రక్రియలో కాంగ్రెస్ పార్టీ బిఎల్ఏలు బాధ్యతాయుతంగా వ్యవహరించారని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కితాబిచ్చారు. మధిర నియోజకవర్గానికి చెందిన బిఎల్ఏలు, వారి కుటుంబ సభ్యులతో మాటూరుపేటలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు.దేశవ్యాప్తంగా ఇతర రాజకీయ పార్టీలకు చెందిన ఓటర్ల పేర్లను ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాంకేతికత ద్వారా గుర్తించి తొలగించే కుట్రలు జరుగుతున్నాయని భట్టి ఆరోపించారు. బీజేపీ నేతృత్వంలో ఇప్పటికే అనేక రాష్ట్రాల్లో ఈ రకంగా ఓట్లను తొలగించి లబ్ధి పొందారని ఆరోపించారు. ఇది ప్రజాస్వామ్యానికే తీవ్ర ప్రమాదకరమని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఓటు హక్కును కోల్పోతే భవిష్యత్తులో రేషన్ కార్డులు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ఆఖరికి ఈ దేశ పౌరసత్వం కూడా ప్రశ్నార్థకమై డిటెన్షన్ సెంటర్లకు వెళ్లాల్సిన దారుణ పరిస్థితులు వస్తాయని హెచ్చరించారు. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ప్రతీ ఒక్కరికీ కాపాడే బాధ్యత కాంగ్రెస్ సైనికులుగా బిఎల్ఏలదేనని స్పష్టం చేశారు.సొంత వ్యాపారాలు, కుటుంబ వ్యవహారాలను పక్కనపెట్టి నెల రోజులుగా సామాజిక బాధ్యతగా పని చేస్తున్న బిఎల్ఏలను, వారి వెనుక నుంచి ప్రోత్సహిస్తున్న కుటుంబ సభ్యులను భట్టి విక్రమార్క ప్రత్యేకంగా అభినందించారు. పార్టీ కోసం నిరంతరం కష్టపడే ప్రతీ బిఎల్ఏ కుటుంబం బాధ్యతను, వారి పిల్లల చదువు, ఉద్యోగ అవకాశాలలో సహకారాన్ని పార్టీ తీసుకుంటుందని ఈ సందర్భంగా భరోసా ఇచ్చారు.మధిర నియోజకవర్గంలో ఇప్పటివరకు దాదాపు 90 శాతం ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియ పూర్తయిందని తెలిపారు. మిగిలిన 10 శాతంలో చనిపోయిన వారి వివరాలను తొలగించడం, శాశ్వతంగా వేరే ప్రాంతాలకు వలస వెళ్లిన వారిని గుర్తించడం వంటి పనులను బూత్‌ల వారీగా పరిశీలించి 100 శాతం నమోదు ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు.కంట్రోల్ రూమ్ ద్వారా నిరంతరం పర్యవేక్షిస్తున్న పీసీసీ ప్రతినిధులను అభినందిస్తూ, బిఎల్ఏలు ఎటువంటి విసుగు చెందకుండా సమన్వయంతో పనిచేసి ఈ నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని ఉప ముఖ్యమంత్రి కోరారు.

## ప్రత్యామ్నాయ పంటల సాగుతో నీటి వనరులను పరిరక్షించాలి

- జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్
- 21 రైతు వేదికల్లో మూడు రోజుల పాటు విత్తన మేళా
- యూరియా కొరత లేదు అవసరమైన ఎరువులు సమృద్ధిగా అందుబాటులో ఉన్నాయి
- మధిర రైతు వేదికలో విత్తన మేళాను ప్రారంభించిన జిల్లా కలెక్టర్



**మధిర ప్రజా జ్యోతి** ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో రైతులు అధిక నీటి అవసరమయ్యే పంటలకు బదులుగా తక్కువ నీటితో సాగయ్యే ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసి నీటి వనరులను సంరక్షించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సూచించారు.సోమవారం మధిర మండల కేంద్రంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన రైతు విత్తన మేళాను జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం లోటు ఏర్పడటంతో భూగర్భ జలాలు తగ్గుముఖం పట్టాయని, ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు కూడా క్రమంగా తగ్గుతున్నందున రైతులు సాగు ప్రణాళికలో మార్పులు చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. వరి వంటి అధిక నీటి అవసరమయ్యే పంటలకు బదులుగా కంది, పెసర, మినుములు, జొన్న, సజ్జలు, కూరగాయలు వంటి తక్కువ నీటితో సాగయ్యే పంటలను సాగు చేయాలని సూచించారు.రైతులకు అవసరమైన ప్రత్యామ్నాయ పంటల విత్తనాలు సులభంగా అందుబాటులో ఉండేలా జూలై 27 నుండి 29 వరకు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని 21 రైతు వేదికల్లో విత్తన మేళాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.ప్రతి మండలానికి ఒక రైతు వేదిక చొప్పున ఈ మేళాలను నిర్వహిస్తున్నామని, రైతులు తమకు సమీపంలోని రైతు వేదికను సందర్శించి నాణ్యమైన విత్తనాలను కొనుగోలు చేసి సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

**››› యూరియా నిల్వలు సమృద్ధిగా ఉన్నాయి....**

వానాకాలం–2026 సీజన్‌కు ఖమ్మం జిల్లాకు మొత్తం 35,267 మెట్రిక్ టన్నుల యూరియా కేటాయించబడిందని కలెక్టర్ తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో ప్రైవేట్ డీలర్ల వద్ద 231.77 మెట్రిక్ టన్నులు (5,150 బస్తాలు), సహకార సంఘాల వద్ద 2,292.25 మెట్రిక్ టన్నులు (50,938 బస్తాలు), మార్క్‌ఫెడ్ ఖమ్మం వద్ద 3,153.96 మెట్రిక్ టన్నులు (70,088 బస్తాలు), సీఆర్‌పీ కమిషనర్ రిజర్వ్ పూల్‌లో 7,698.355 మెట్రిక్ టన్నులు (1,71,074 బస్తాలు), కంపెనీ గోదాముల్లో 991 మెట్రిక్ టన్నులు (22,022 బస్తాలు) అందుబాటులో ఉన్నాయని వివరించారు. మొత్తం 3,19,272 యూరియా బస్తాలు జిల్లాలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు.జిల్లాలో ఇప్పటివరకు యూరియా యాప్ ద్వారా 1,27,377 మంది రైతులు 3,90,762 బస్తాలను బుక్ చేసుకోగా, అందులో 3,52,172 బస్తాలను కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఖమ్మం జిల్లాలో ఎటువంటి యూరియా కొరత లేదని, రైతులు అనవసర ఆందోళన చెందకుండా తమ సమీపంలోని సహకార సంఘాలు, ఎరువుల విక్రయ కేంద్రాల నుంచి అవసరమైన యూరియాను కొనుగోలు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు.

ఈ కార్యక్రమంలో మధిర వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ బండారు నరసింహారావు, సిపిఓ శ్రీనివాస్, వ్యవసాయ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## గురుకుల ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం పి ఆర్ టి యు తోనే సాధ్యం

- పి ఆర్ టి యు జిల్లా అధ్యక్షులు కట్టా శేఖర్ రావు

**మధిర ప్రజా జ్యోతి** పి ఆర్ టి యు మండల శాఖ ఆధ్వర్యంలో సోమవారం ఖమ్మం జిల్లా శాఖ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు కట్టా శేఖర్ రావు, ఆర్ రంగారావు నేతృత్వంలో జిల్లాశాఖ బాధ్యులు గురుకుల పాఠశాలలను సందర్శించించి వారి సమస్యలును అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా కృష్ణాపురంఎం జె పి టి పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశం లో జిల్లా అధ్యక్షులు కట్టా శేఖర్ మాట్లాడుతూ గురుకుల పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం పి ఆర్ టి యు ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నారని పి ఆర్ టి యు రాష్ట్రనాయకత్వంఎమ్మెల్సీ ఆధ్వర్యంలో అనేక మార్లు గురుకుల ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం సంబంధిత రాష్ట్ర మంత్రులను, వారి సొసైటీల సెక్రటరీలను కలిసి ప్రాతినిధ్యం చేయడం జరిగిందని బి సి గురుకుల పాఠశాలల సమయపాలన మార్పు, 010 పద్దు ద్వారా వేతనాలు కేర్ టేకర్ నియామకం తదితర సమస్యల పరిష్కారం టిఆర్టియు తోనే సాధ్యమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమం లో జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ రంగారావు జిల్లా అసోసియేట్ అధ్యక్షులు ఆర్ బ్రహ్మారెడ్డి టి రత్నకుమార్ జిల్లా ఉపాధ్యక్షులు సిహెచ్ వి రవికుమార్ మధిర మండల శాఖ అధ్యక్షులు చిలుకూరి సత్యనారాయణరెడ్డి పి ఆర్ టి యు అనుబంధ సంఘ ఎం జె పి టి జిల్లా కన్వీనర్ ఆర్ రాము కోకన్వీనర్ లు బి మహేష్ బి లక్ష్మి నారాయణ, డి వనజా రాణి తదితరలు పాల్గొన్నారు.



# విద్యార్థుల భవిష్యత్తే రాష్ట్ర భవిష్యత్తు...

(మొదటి పేజీ తరువాయి...)

ఆయన అన్నారు. మధిర నియోజకవర్గ కేంద్రంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు పోషకాహార అల్పాహారాన్ని అందించే సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ సెంటర్ ను డిప్యూటీ సీఎం సోమవారం ప్రారంభించారు. అనంతరం ఏర్పాటుచేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో పుట్టిన ఏ బిడ్డ కూడా అర్థాకలితో పాఠశాలకు వెళ్లకూడదన్నదే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ ప్రధాన ఆశయమని అన్నారు. విద్యార్థుల భవిష్యత్తే రాష్ట్ర భవిష్యత్తు అని, ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ పిల్లల శారీరక, మానసిక వికాసం కోసం ఉదయమే రుచికరమైన, శుచి–శుభ్రతతో కూడిన పౌష్టికాహారాన్ని అందించేందుకు ప్రజాప్రభుత్వం శ్రీకారం చుట్టిందని తెలిపారు. బడ్జెట్ లో ప్రకటించిన విధంగానే రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత అల్పాహార పథకాన్ని మధిర నియోజకవర్గంలో ప్రారంభించినట్లు చెప్పారు. ప్రజా ప్రభుత్వంలో ఇందిరమ్మ రాజ్యంలో ఏ బిడ్డ కూడా అర్థాకలితో పాఠశాలకు వెళ్లకూడదు.. ఇక్కడ పుట్టిన ప్రతి బిడ్డ.. రాష్ట్ర భవిష్యత్తు ఆని ఆయన అన్నారు. వారి భవిష్యత్తే మన భవిష్యత్తు. అటువంటి బిడ్డల భవిష్యత్తు కోసం ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ సంతృప్తికరంగా ఉదయం పూట బ్రేక్ ఫాస్ట్ చేసి చదువుకోవాలని అన్నారు. రుచికరమైన, శుచి శుభ్రతతో కూడిన న్యూట్రిషియస్ ఫుడ్ ని మనం అందించాలని చెప్పి ఈ క్యాబినెట్ చేసిన నిర్ణయం మేరకు బడ్జెట్లో ఈ పథకాన్ని ప్రవేశపెట్టడం జరిగిందని ఆయన తెలిపారు. అర్థాకలితో పాఠశాలకు వచ్చి అధ్యాపకులు చెప్పే పాఠాలను సరిగ్గా వినలేక, ఆకలితో సతమతమవుతూ చదువు మీద దృష్టి పెట్టలేని పరిస్థితి ఏ విద్యార్థికి రాకూడదనే ఆలోచనతో ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వం ఈ ఈ నిర్ణయం తీసుకుందని ఆయన తెలిపారు. మానవ వనరులు మన రాష్ట్ర సంపదని, ఏ రాష్ట్ర అభివృద్ధికైనా సహజ వనరులు ఎంత అవసరమో.. సమర్థవంతమైన మానవ వనరులు కూడా అంతే అవసరమని భట్టి విక్రమార్క నొక్కి వక్కాణించారు. అత్యంత ప్రతిభావంతులుగా తయారైనటువంటి మానవ వనరులు ఉన్నటువంటి రాష్ట్రం గాని, దేశం గాని ప్రపంచంలో అత్యంత శక్తివంతంగా మారుతుందని ఆయన అన్నారు. రాష్ట్రానికే కాదు దేశానికి, ప్రపంచానికి కూడా దశా దిశా నిర్దేశం చేయగలిగినటువంటి మానవ వనరుల్ని సానబెట్టిన వజ్రాల్లాగా ప్రపంచం మీదికి మనం వదిలిపెట్టగలగాలని, అటువంటి వజ్రాల్ని తయారు చేసుకోవాల్సిన తరుణంలో మార్నింగ్ బ్రేక్ ఫాస్ట్ పథకాన్ని రాష్ట్రవ్యాప్తంగా మొదలుపెట్టే కార్యక్రమానికి నాంది పలికామని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 27 లక్షల మంది విద్యార్థులకి ఒకటే సమయానికి వేడిగా అల్పాహారం అందించడం అంటే ఇది ఒక చారిత్రాత్మకమైన నిర్ణయమని, ఈ దేశ చరిత్రలోనే సువర్ణాక్షరాలతో లెక్కించాల్సిన అంశమని అన్నారు. సాధారణంగా ఒక కుటుంబంలో ఇద్దరు పిల్లలకు సమయానికి టిఫిన్ కట్టడమే తల్లిదండ్రులకు కష్టంగా మారిన రోజులివి. అలాంటిది ప్రభుత్వ పాఠశాలల్లో చదివే 20 లక్షల మంది, రెసిడెన్షియల్ స్కూళ్లలోని 7 లక్షల మంది పిల్లలతో కలిపి మొత్తం 27 లక్షల మందికి ఒకే సమయానికి వేడివేడిగా అల్పాహారం అందించడం దేశ చరిత్రలోనే సువర్ణాక్షరాలతో లిఖించదగిన అంశమని డిప్యూటీ సీఎం అన్నారు. ప్రపంచంలో ఏ దేశంలోనూ, ఏ రాష్ట్రంలోనూ ఇంత పెద్ద ఎత్తున అల్పాహారం అందించే వ్యవస్థ లేదని ఆయన పేర్కొన్నారు. సంకల్పం మంచిదైతే భగవంతుని ఆశీస్సులు ఉంటాయని, అందుకే సాధ్యం కాదనుకున్న ఈ కార్యక్రమాన్ని ప్రజాప్రభుత్వం సాధ్యం చేసి చూపిందని డిప్యూటీ సీఎం హర్షం వ్యక్తం చేశారు. హరే కృష్ణ మిషన్ భాగస్వామ్యంతో పకడ్బందీగా, అత్యంత శుభ్రమైన వాతావరణంలో మెకనైజ్డ్ కిచెన్లను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ప్రస్తుతం మధిరలోని తాత్కాలిక సెంట్రలైజ్డ్ కిచెన్ ద్వారా 16 మండలాల స్కూళ్లకు వాహనాల్లో అల్పాహారం అందిస్తున్నామని అన్నారు. రాబోయే 3 నెలల్లో రాష్ట్రవ్యాప్తంగా శాశ్వత కిచెన్ నిర్మాణాలను పూర్తి చేసి విద్యార్థులకు ఉదయం పూట అల్పాహారాన్ని అందించనున్నట్లు భట్టి విక్రమార్క చెప్పారు. పిల్లలకు అందించే అల్పాహారంతో పాటు పౌష్టికాహారం కోసం వారానికి 3 రోజులు పాలు, మరో 3 రోజులు రాగి జావను ప్రత్యేకంగా అందిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. బడి పిల్లలతో కలిసి భోజనం చేయడం తన రాజకీయ జీవితంలో ఎన్నడూ లేనంత తృప్తిని ఇచ్చిందని ఆనందం వ్యక్తం చేశారు. పాలన అంటే ఒక హోదా కాదు. అధికారం అంటే పెత్తనం చలాయించడం కాదు. అధికారమన్నా, పాలనన్నా ఉన్న వనరుల్ని పోగేసి సమాజ హితం కోసం ప్రణాళికలు తయారు చేయడం.. వారి అభివృద్ధి కోసం పునాదులు వేయాలని ఆలోచనతో ముందుకు సాగాలని అన్నారు. అందులో భాగంగానే ఈరోజు రాష్ట్రవ్యాప్తంగా ఇల్లు లేని వాళ్ళకోసం రూ 5 లక్షలతో ఒక్కొక్క ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం జరుగుతుందన్నారు. గృహ ప్రవేశానికి మనం వెళ్లినప్పుడు ఆ పేదవాళ్ల కళ్లల్లో ఆనందం చూస్తే.. ఇది కదా పాలన అనే అనుభూతి కలుగుతోంది. ఆదిలాబాద్ నుంచి ఖమ్మం వరకు చేసిన 'పీపుల్స్ మార్చ్' పాదయాత్రలో ప్రజలు పడుతున్న కష్టాలను కళ్లారా చూశానని భట్టి విక్రమార్క చెప్పారు. ఈ సమయంలో బడుల దుస్థితి, నిరుద్యోగుల ఆవేదన, ఇల్లు లేని పేదల బాధలను విన్నానని చెప్పారు. ఆనాడే నా మనసులో రూపుదిద్దుకున్న ఆలోచనలే నేడు ఒక్కొక్కటిగా పథకాలుగా మారుతున్నాయని భావోద్వేగానికి లోనవుతూ డిప్యూటీ సీఎం తెలిపారు. నిరుపేదల సొంతింటి కల నెరవేర్చేందుకు రూ. 22,500 కోట్లతో మొదటి విడతలోనే 4.5 లక్షల ఇళ్లను మంజూరు చేశామన్నారు. మహాలక్ష్మి పథకంతో సగం జనాభా ఉన్న మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించి ఆర్థికంగా తోడ్పాటున ందిస్తున్నామ న్నారు. మహిళలను కోటీశ్వరులను చేసేందుకు బ్యాంక్ లింకేజీ ద్వారా ఇప్పటికే రూ. 67,000 కోట్ల వడ్డీ లేని రుణాలు ఇచ్చామన్నారు. పేద కుటుంబ వైద్య పరిమితిని ఏకంగా రూ. 10 లక్షలకు పెంచామన్నారు. కోటి 6 లక్షల కుటుంబాలకు నెలకు మనిషికి 6 కేజీల చొప్పున సన్న బియ్యాన్ని అందిస్తున్నామన్నారు. కేవలం 9 రోజుల్లోనే రూ. 9,000 కోట్ల నిధులను నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేశామని డిప్యూటీ సీఎం వెల్లడించారు. జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పిల్లలకు ఇది మంచి కార్యక్రమమని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలకు వచ్చే విద్యార్థులు ఆకలితో వస్తే ఏం వింటారనే మధ్యాహ్న భోజనం పథకం వచ్చిందని, దానికి కొనసాగింపుగా అల్పాహార పథకం వచ్చిందన్నారు. ప్రభుత్వ సౌకర్యాలు అందిపుచ్చుకుని పిల్లలు ఉన్నతంగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి మాట్లాడుతూ, పిల్లలకు శారీరక దృఢత్వం వున్నప్పుడు చదువు అబ్బుతుందని అన్నారు. ఆరోగ్యకర సమాజ నిర్మాణానికి అల్పాహార పథకం దోహదపడుతుందని తెలిపారు. ఇది మంచి కార్యక్రమమని, ఎల్లకాలం కొనసాగాలని కోరుకుంటున్నట్లు ఎమ్మెల్సీ అన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్ మాట్లాడుతూ, పిల్లలు ఆరోగ్యాంగా ఉండాలని ప్రభుత్వం అల్పాహార పథకం అమలు చేస్తుందని అన్నారు. కార్యక్రమంలో హరే కృష్ణ మూవ్మెంట్ చారిటబుల్ ఫౌండేషన్, ది అక్షయ పాత్ర ఫౌండేషన్ అధ్యక్షులు సత్య గౌర చంద్ర దాస స్వామిజీ మాట్లాడుతూ, ఇది అద్భుత పథకమని అన్నారు. ప్రతి రోజు విద్యార్థిని పాఠశాలకు రప్పించేలా అల్పాహారం ఉంటుందన్నారు. అల్పాహారం తో పాటు పాలు అందిస్తామని తెలిపారు. అల్పాహారం అందజేసే ప్రక్రియను, సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ పనితీరును ఈ సందర్భంగా స్వామీజీ వివరించారు. ఈ కార్యక్రమంలో సింరేణి సిఎండి బుద్ధప్రకాశ్ జ్యోతి, హరే కృష్ణ మూవ్ మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ సీఈఓ కౌంతేయ స్వామీజీ, కార్పొరేషన్ చైర్మన్లు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, రాయల నాగేశ్వర రావు, డిఇఓ సదానందం, ఖమ్మం ఆర్డీవో శ్రీనివాస్, ట్రాన్స్కో ఎస్ఇ శ్రీనివాస చారి, ఆర్ అండ్ బి ఎస్ఇ యుగంధర్ రావు, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి రవిబాబు, సిపిఓ శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ మహంకాళి అమ్మవారికి రూ.50,116 విరాళం సమర్పించిన ఆవుల రాజేష్ – లక్ష్మీ దంపతులు



**చింతకాని జులై 27ప్రజాజ్యోతి :** మండలంలోని వందనం గ్రామ సర్పంచ్ ఆవుల నాగేశ్వరరావు పెద్ద కుమారుడు, కిన్ క్యూర్ ఫార్మా కంపెనీ వ్యవస్థాపకుడు ఆవుల రాజేష్ మరియు ఆయన సతీమణి లక్ష్మీ దంపతులు భక్తి శ్రద్ధలతో హైదరాబాద్ రాంపల్లిలోని శ్రీ మహంకాళి అమ్మవారిని దర్శించుకుని రూ.50,116లను అమ్మవారి ఆలయానికి విరాళంగా సమర్పించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు పొందిన దంపతులు, ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, ఐశ్వర్యాలతో వర్ధిల్లాలని ప్రార్థించారు. సమాజ సేవతో పాటు ఆధ్యాత్మిక విలువలను కూడా పాటిస్తూ ఆలయ అభివృద్ధికి తమ వంతు సహకారం అందించడం అభినందనీయమని పలువురు కొనియాడారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఆవుల రాజేష్ – లక్ష్మీ దంపతులకు అమ్మవారి తీర్థప్రసాదాలు అందించి, ప్రత్యేక ఆశీర్వచనాలు అందజేశారు. వందనం గ్రామ ప్రజలు, కుటుంబ సభ్యులు ఈ దాతృత్వ కార్యక్రమాన్ని అభినందిస్తూ దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు.

## మానవత్వాన్ని చాటుకున్న టూ వీలర్స్ మెకానిక్ యూనియన్

- రవి కి వైద్య నిమిత్తం రూ..11వేలు అందజేత



**సత్తుపల్లి జూలై 27(ప్రజా జ్యోతి)** సత్తుపల్లి మోటార్ సైకిల్ మెకానిక్ వర్కర్స్ యూనియన్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో, అనారోగ్య స్థితిలో ఉన్న నిమ్మగడ్డ రవికి రూ..11 వేల రూపాయలను ఆర్థిక సాయం అందించి, మానవత్వాన్ని చాటుకున్న ఘనత సోమవారం చోటుచేసుకుంది. టూ వీలర్స్ మెకానిక్ యూనియన్ గౌరవ అధ్యక్షులు అబ్దుల్ హకీం, అధ్యక్షుడు తాళ్లూరు భాస్కర్ తెలిపిన వివరాలు ప్రకారం సిద్ధారం రోడ్లో గల, టూవీలర్ మెకానిక్ గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఆయన ఆర్థిక పరిస్థితి గమనించిన, సత్తుపల్లి టూ వీలర్ మెకానిక్ సంఘం అందరూ కలిసికట్టుగా , తలా కొంత చందాలుగా డబ్బులు సేకరించి, వైద్య నిమిత్తం రూ..11 వేల రూపాయలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అందరం ఐక్యంగా ఉంటూ, ప్రతి ఒక్కరికి అండగా ఉండే విధంగా ఉండాలని, ఒక్కరే మనిషికి మించిన భారాన్ని భరించలేరు కాబట్టి, టు వీలర్ మెకానిక్ అందరూ కలిసి కొంత సాయం గా వైద్యానికి అందించి చేయూతగా ఉండటంతో, ఆ కుటుంబానికి అండగా నిలిచారు. సమిష్టి కృషితో ఏదైనా సాధించుకోవచ్చు అనే నానుడికి అర్థం పలికే విధంగా, సహాయం అందించారు. ముందు ముందు కూడా ఏ ఒక్క మెకానిక్ ఇబ్బంది పడకుండా, ప్రతి ఒక్కరికి హెల్త్ ఇన్సూరెన్స్, గ్రూప్ ఇన్సూరెన్స్ చేయించుకునే విధంగా సన్నాహాలు ఏర్పాటు చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో గౌరవ సలహాదారులు శ్రీనివాసరావు, ఎస్ కే బాజీ బాబా, మురళి, షంషేర్, రహీం ,మీరా, రామకృష్ణ సుధాకర్, శ్రీకాంత్, ప్రసాద్ తదితరులు ఉన్నారు.

## సమాజసేవకు కొడుకును అంకితం చేసిన మల్లూరు కు సీపీఎం నివాళి



**సత్తుపల్లి జూలై 27 (ప్రజా జ్యోతి)** నిరంతరం సమాజ సేవకు పాటుపడే భారత కమ్యూనిస్ట్ పార్టీ మార్క్సిస్టు(సీపీఐఎం) కు తమ పెద్ద కొడుకును అంకితం చేసిన అమరజీవి మల్లూరు వెంకట సత్యనారాయణ కు సీపీఎం రాష్ట్ర, జిల్లా నేతలు సోమవారం ఘనంగా నివాళులు అర్పించారు. పట్టణంలోని కాకర్లపల్లి రోడ్డులో గల కర్మల భవనంలో జరిగిన మల్లూరు మొదటి వర్ధంతి కార్యక్రమం లో పాల్గొన్న సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బొంతు రాంబాబు మాట్లా డుతూ అవినీతి చేయకుండా, ఎవరికి హాని చేయకుండా తమ కుటుంబాన్ని పోషించాలని సదుద్దేశ్యంతో జీవించిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. తనకున్న అంగ వైకల్యాన్ని సైతం లెక్కచేయకుండా వేలాది కిలోమీటర్ల దూరం కాలి నడకతో నడిచి కార్మికుల, కూలీల నివాస ప్రాంతాల్లో చిరు వ్యాపారం చేస్తూ జీవనం గడిపిన బాటసారి సత్యనారాయణ అని ఆయన జీవితం నేటి యువతకు మార్గదర్శం అని అన్నారు. అనంతరం పాల్గొన్న సీఐటీయూ రాష్ట్ర కమిటి సభ్యులు చలమాల విఠల్ రావు, ఆల్ ఇండియా వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నేత(ఏఐఏడబ్ల్యు యు) నేత మెరుగు సత్యనారాయణ, సీపీఎం పట్టణ కార్యదర్శి కొలికపోగు సర్వేశ్వరరావులు మాట్లాడుతూ ఆస్తులు కూడబెట్టడానికి కాకుండా పొట్ట కూటి కోసం నిస్వార్థంగా నిరాడంబరంగా జీవించిన మహోన్నత వ్యక్తి అని అన్నారు. ఆస్తులు లేకున్నా ఆయన ఆలోచన గొప్పది అని అన్నారు. సత్తుపల్లి ప్రాంతంలో కేలండర్ల బాబాయి లేరని తెలిచిన ప్రజలు కన్నీరు పెట్టిన పరిస్థితి ఉందని ప్రజల మనసులో వెంకట సత్యనారాయణ చెరగని ముద్ర వేసుకున్నారని అన్నారు. మల్లూరు చిత్ర పటానికి పుష్పాలు వేసి పిడికిలి బిగించి అభివాదం చేశారు. ఈ కార్యక్రమంలో: మల్లూ రు సతీమణి పద్మావతి, కొడుకులు మల్లూరు చంద్రశేఖర్, మల్లూరు మోహన్, పట్టణ గుమస్తాల సంఘం అధ్యక్షులు అల్లంశెట్టి రాంబాబు, రత్నాకర్, మోహన్, జర్నలిస్టులు ఆరెంపుల హరిబాబు, తోట నాని, తెలుగుదేశం నాయకులు పో ట్రూ రామారావు, తిమ్మిడి రాంబాబు, చల్లగుల్ల అప్పారావు, పలగాని రమ్య, ఉం డవల్లి శ్రీకాంత్, వేంసూరు మండల సీపీఎం నాయకులు దంకర శ్రీను, బూరు గు శ్రీదేవి, సోనాక్షి తుంగా నాగరాజు, కోటి, టోపీ శ్రీను బంధుమిత్రులు పాల్గొన్నారు.